# 'కారంపూడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి'




కారంపూడిలో ప్రదర్శన

**కారంపూడి, 23-12-15 :**

కారంపూడి మండలాన్ని, కరువు మండలంగా ప్రకటించాలని, దేవాదాయ, ధర్మాదాయ, పూజారి మాన్యం భూముల కౌలును రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో కారంపూడిలో ప్రదర్శన మరియు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ నీలాద్రి రాంబాబు, జక్కంపూడి పద్మ మాట్లాడుతూ అననుకూల వర్షపాతం, మరియు సాగర్ కుడికాలువ నీరురాక, కారంపూడి మండలంలో వరి, ఇతర పంటలు వేయలేదని, దీనికితోడు పంటలు వేసిన రైతాంగం సరైన దిగుబడి రాక నష్టపోయారని, ఇలాంటి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని, అదేవిధంగా కారంపూడి మండలంలో దేవాదాయ, ధర్మాదాయ, పూజారిమాన్యం సాగుచేసుకుంటున్న రైతులందరూ ఒక్క ఎకరంలో కూడా పంటవేయలేదని, ఈ పరిస్థితుల్లో కౌలు చెల్లించే పరిస్థితి లేదు కనుక ఈ సంవత్సరం చెల్లించాల్సిన మాన్యం కౌలును వెంటనే రద్దుచేయాలని, వ్యవసాయం సాగక రైతుకూలీలకు పనులు లేక అల్లాడుతున్న పరిస్థితి ఉందని, అందువలన ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలని, నేడు నెలకొని ఉన్న కరువు పరిస్థితుల్లో కరువు నివారణా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహశీల్దార్‌కు మరియు ఎండోమెంట్ అధికారికి వినతిపత్రాలు అందచేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీను, రైతుకూలీసంఘం సభ్యులు సుబ్బారావు, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

oooooo